క్లుప్తంగా

నేడు రేషన్‌కార్డుల పంపిణీ

హాలియా : పట్టణంలోని లక్ష్మి నరసింహ గార్డెన్‌లో మంగళవారం కొత్త రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు అనుముల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి హాజరై లబ్ధిదారులకు రేషన్‌కార్డులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

నేడు చందంపేటలో ఎమ్మెల్యే పర్యటన

చందంపేట : మండలంలోని పెద్దమూల, చిత్రియాల, నల్లమూల గ్రామాల్లో మంగళవారం దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ పలు అభివృద్ధి పనుల్లో పాల్గొననున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు జర్పుల బద్యానాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ శ్రేణులుపెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వ్యవసాయ పనిముట్లకు దరఖాస్తుల ఆహ్వానం

మాడుగులపల్లి : ఎస్ఎంఏఎం పథకం కింద రైతులకు అందించే వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లను రైతులు దరఖాస్తు చేసుకోని పొందాలని ఏఓ శివరాంకుమార్ సోమవారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులు 50శాతం సబ్సిడీతో, ఇతరులకు 40శాతం సబ్సిడీతో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అర్హులైన రైతులు దరఖాస్తు ఫారంతో భూమి పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ జీరాక్స్, ఆర్‌సీ జీరాక్స్‌లు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో ఈనెల 14లోపు ఏఈఓలకు అందించాలన్నారు.

పెద్దఅడిశర్లపల్లి : ఉమ్మడి పెద్దఅడిశర్లపల్లి మండలంలోని రైతులు వ్యవసాయ పనిముట్ల కు ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పాండు తెలిపారు. రైతు పట్టాదారు పాస్‌బుక్ జీరాక్స్, ఆధార్‌కార్డు జీరాక్స్, ఒక పాస్‌ఫోటోను జత చేసి దరఖాస్తు ఫారాన్ని జత చేయాలని కోరారు.

వార్షికోత్సవాలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఆంజనేయులు

దేవరకొండ : ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలమల్ల ఆంజనేయులు పిలుపునిచ్చారు. సోమవారం దేవరకొండలో నిర్వహించిన ఆ సంఘం డివిజన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్షికోత్సవ వేడుకల్లో విద్యార్థులు, అభ్యుదయ వాదులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో శివకుమార్, సాయి, బాను, వినయ్, మధు, అరవింద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి నివాళి

మిర్యాలగూడ అర్బన్ : పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు అక్కి మోహన్ సోమవారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన మృతికి దామరచర్ల మండల విద్యాధికారి బాలాజీ నాయక్, బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేష్ లు సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక కార్యక్రమాల్లో అక్కి మోహన్ చురుకుగా పాల్గొనేవారని గుర్తు చేశారు. ఆయన మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు చాపల శ్రీనివాస్, ఉపాధ్యాయులు అంబటి శ్రీనివాస్, మాలి సైదులు, వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సైకాలజిస్టులను నియమించాలని వినతి

నల్లగొండ: జిల్లాలోని విద్యా సంస్థల్లో సైకలాజిస్టులను నియమించాలని కోరుతు సోమవారం కలెక్టరేట్ ఏఓ మోతిలాల్‌కు తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోకల వెంకటేశ్వర్లు, అరుణ, శోభ మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిళ్లకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. సైకాలజిస్టులను నియమించడం వల్ల విద్యార్థుల్లో సానుకూల దృక్పథం కలిగించి, భవిష్యత్‌పై ఆశలు పెంచేందుకు కృషి చేస్తారన్నారు.

రిజర్వేషన్లపై చట్టం చేయాలని ఆందోళన

నల్లగొండ టౌన్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై పార్లమెంట్లో చట్టం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సయ్యద్ హాశం డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్ల విషయంలో బీజేపీ ద్వంద వైఖరి మానుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ ఏకపక్షంగా వెళ్లకుండా ప్రతిపక్ష పార్టీలతో కలిసి పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీం, పట్టణ కార్యదర్శి సత్తయ్య, నరసింహ ఉన్నారు.

‘మిర్యాల’లో మళ్లీ భువన్ సర్వే

- ఈ నెలాఖరులోగా ప్రారంభించే అవకాశం
- పారదర్శకంగా చేపట్టేందుకు యంత్రాంగం సన్నాహాలు
- మున్సిపాలిటీకి పెరగనున్న ఆదాయం



మిర్యాలగూడలో ఇంటి కొలతలు తీసుకుంటున్న మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది (ఫైల్)

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీలో మళ్లీ భువన సర్వే చేపట్టేందుకు యంత్రాంగం సిద్ధమవుతోంది. అయితే 2020లో ప్రారంభించిన భువన్ యాప్ సర్వేను కరోనా కారణంగా 2021లో నిలిపివేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మరోసారి పూర్తి స్థాయిలో ఈ నెలాఖరులోగా సర్వే చేపట్టేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గతంలో సర్వే నిర్వహించిన ఇళ్లు, ఇతర వ్యాపార, వాణిజ్య సంస్థలను మళ్లీ సర్వే చేసి కొత్త పన్ను మదింపు చేయనున్నారు. ఆస్తి పన్ను చెల్లింపుల్లో లోపాలు, అక్రమాలకు చెక్ పెట్టడంతోపాటు మున్సిపాలిటీలకు ఆదాయం పెంచేలా పురపాల శాఖ సాంకేతిక పరిజ్ఞానంతో భువన్ యాప్‌ను తీసుకొచ్చింది. తద్వారా మున్సిపాలిటీలోని ఇళ్లకు వెళ్లి పూర్తి స్థాయిలో కొలతలు తీసుకొని, గూగుల్ మ్యాప్ ద్వారా ప్రతి నిర్మాణాన్ని ఫొటోలు తీసి వాటిని భువన్ యాప్‌లో అప్‌లోడ్ చేసి, జియోట్యాగింగ్ చేయనున్నారు. ఇంటికి సంబంధించిన కొలతలు, ఏరియా పేరు, చదరపు మీటర్ల వివరాలతో పాటు ఇళ్లు ఏ టైప్, ఎన్ని అంతస్తులు, నివాసానికి వినియోగిస్తున్నారా..వాణిజ్యం కోసం వినియోగిస్తున్నారా..అనే పూర్తి వివరాలను భువన్ యాప్‌లో నమోదు చేయగానే మున్సిపాలిటీ నిర్దేశించిన ప్రకారం ఆస్తిపన్ను మదింపు జరుగుతుంది.

మున్సిపాలిటీ వివరాలు

వార్డుల సంఖ్య	48
జనాభా	1.33 లక్షలు
అసెస్‌మెంట్లు	26,818
ఆస్తిపన్ను డిమాండ్	రూ.23.44 కోట్లు
గతంలో సర్వేచేసిన గృహాలు	5,375

గతంలో 5,375 గృహాలు మాత్రమే..

మిర్యాలగూడ మున్సిపాలిటీలో 2020–21లో నిర్వహించిన భువన్ సర్వేలో భాగంగా 1వ వార్డు నుంచి 15 వార్డులు సర్వే చేసేందుకు మ్యాక్స్ సంస్థ ప్రణాళిక తయారు చేసింది. దీంట్లో భాగంగా ఒక్క 13వ వార్డు మాత్రమే భువన్ యాప్‌లో నమోదు చేశారు. అయితే గతంలో కొందరు.. మున్సిపల్ అధికారులకు ఎంతో కొంత ముట్టజెప్పి అసలు ఆస్తి పన్నుకన్నా తక్కువగా రాయించుకొని నేటి వరకు కూడా అదే చెల్లిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. రికార్డుల్లో చూపించే కొలతల కంటే ఎక్కువ విస్తీర్ణం, అదనపు గదులు, అంతస్తులకు పన్నులను చెల్లించడంలేదు. భువన్ యాప్‌లో మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఆయా ఇంటి కొలతలను కొలిచి వాటి ఫొటోలను సైతం అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ కార్యాలయాలు, రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్, మిక్స్‌డ్ రెసిడెన్షియల్ వారి నుంచి రూ.23,44,32,000 వరకు ఆస్తిపన్ను వసూలు లక్ష్యంగా మున్సిపల్ యంత్రాంగం పెట్టుకుంది. ఈ భువన్ సర్వే పూర్తయితే ప్రస్తుతం మున్సిపల్ ఆదాయం అదనంగా 30 నుంచి 50 శాతం పెరిగే అవకాశం ఉంది.

పెద్దలకు తక్కువ..పేదలకు ఎక్కువ

గతంలో చేపట్టిన భువన్ సర్వే తప్పులతడకగా మారింది. ఇళ్ల విస్తీర్ణానికి సంబంధించి కొలతలు సరిగా నిర్వహించలేదు. బహుళ అంతస్తులకు సంబంధించి తప్పుగా నమోదు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజకీయంగా పలుకుబడి ఉంటే పెద్దపెద్ద భవనాలు ఉన్నవారికి తక్కువగా, నిరుపేదలకు ఎక్కువ మొత్తంలో ఆస్తి పన్నులు వేశారనే విమర్శలు ఉన్నాయి.

లాగిన్ ఓపెన్ కాగానే సర్వే చేపడతాం



సీడీఎంఏ నుంచి భువన్ సర్వే లాగిన్ ఓపెన్ కాగానే మిర్యాలగూడ మున్సిపాలిటీలో భువన సర్వేను పారదర్శకంగా చేపడతాం. ఉన్నతాధికారుల ఆదేశంతోపాటు భువన్ యాప్ లాగిన్ ఓపెన్ కాగానే ఈ నెలాఖరులోగా సర్వే ప్రారంభిస్తాం. గతంలో జరిగినట్టు ఈ సారి లోటుపాట్లు లేకుండా చూస్తాం.

– జి.శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ మిర్యాలగూడ

పెంచిన బస్ చార్జీలు తగ్గించాలని ధర్నా



ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేస్తున్న సేవాలాల్ సేన సభ్యులు

మిర్యాలగూడ టౌన్ : స్పెషల్ బస్సుల పేరుతో పెంచిన చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సేవాలాల్ సేన ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధనవాత్ ప్రకాశ్ నాయక్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో వివిధ పండుగల పేరుతో ఆర్టీసీ బస్సులకు స్పెషల్ బోర్డులను ఏర్పాటు చేసి అక్రమంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి నేటి వరకు కూడా పండుగల పేరుతో స్పెషల్ బస్సులను నడిపిస్తున్న బస్సులకు అదనపు చార్జీలను పెంచలేదన్నారు. వివిధ ప్రాంతాల్లో ఉంటున్న వారు పండులకు ఇంటికి రావాలంటేనే అదనపు చార్జీలు వసూలు చేయడంతో భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు సూపర్ లగ్జరీలో ఇద్దరు వెళ్లితే రూ.860 ఉంటే ఒక్కరికి 450 రూపాయల వరకు చార్జీలను టికెట్ కోట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సేనా నేతలు దస్రునాయక్, అనిల్ నాయక్, రాందాస్‌నాయక్, హరీష్‌నాయక్,బాబునాయక్, దినేష్‌నాయక్, చంద్రునాయక్, బీసీ సంఘం నాయకులు రమేష్ తదితరులున్నారు.

దాతల సహకారం అభినందనీయం



దాతలతో కలిసి విద్యార్థులకు టై, బెల్టులు, షూ అందజేస్తున్న ఎంఈఓ బాలు

మిర్యాలగూడ : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు అందిస్తున్న సహాయ, సహకారాలు అభినందనీయమని ఎంఈఓ లావూరి బాలు అన్నారు. సోమవారం మండలంలోని లావూడితండాలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజ్య ఆధ్వర్యంలో లావూడితండా ఉద్యోగుల సంఘం సహకారంతో పాఠశాల భవనానికి కలర్స్ వేయించడమే కాకుండా విద్యార్థులకు టై, బెల్ట్‌లు, ష్యూ, ఐడీ కార్డులు అందించారు. ఈ సందర్భంగా లావూడి తండా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జగన్‌నాయక్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమవంతుగా సహాయ, సహకారాలు అందించామని భవిష్యత్‌లో విద్యార్థుల సంఖ్య పెరిగితే మరింత సహకారం అందించడానికి తమ సంఘం ముందుంటుందన్నారు.ఈ కార్యక్రమంలో అడవిదేవులపల్లి ఎంఈవో వరలక్ష్మీ, డాక్టర్ లావూడి బాలాజీ, గ్రామ పెద్దలు లావూడి శ్రీహరి, చినా, నాగా తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న జడ్జి అనిత

దేవరకొండ : క్రీడలతో ప్రతి ఒక్కరికీ మానసిక ప్రశాంతత చేకూరుతుందని దేవరకొండ సీనియర్ సివిల్ జడ్జి కె.అనిత అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని దేవరకొండ మున్సిఫ్ కోర్టు ఆవరణలో సోమవారం న్యాయవాదులకు ఏర్పాటు చేసిన చెస్, క్యారమ్ క్రీడా పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు.క్రీడల ద్వారా స్నేహ భావం సైతం పెం పొందుతుందని ఆమె తెలిపారు.నిరంతరం విధి నిర్వహణలో తలమునకలయ్యే న్యాయ వాదులు క్రీడలతో కొంత మేర మానసిక ప్రశాంతత పొందుతారని అన్నారు.క్రీడల్లో గెలుపోటములు సహజమని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు స న్నాయిల ఉమామహేష్‌యాదవ్,ఏజీపి నెమ్మికంటి రమాశంకర్,లోహిత్‌రెడ్డి,ఇంద్ర వరప్ర సాద్,వస్కుల శ్రీను, ఉప్పల రమేష్,మాడెం రాములు,వనం జగదీష్, రియాజ్, వనం పుష్పలత,ఇడెం రవి,శ్రీకాంత్,కృష్ణ, సాయి,కోర్టు సిబ్బంది ఉన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

మిర్యాలగూడ : రైతు బీమా పథకం 2025–26కుగాను జూన్ 5వరకు నూతనంగా పట్టాదారు పాస్‌పుస్తకం వచ్చిన కొండ్రపోల్ క్లస్టర్ పరిధిలోని రెవెన్యూ గ్రామాలైన దిలావర్‌పూర్, కొండ్రపోల్, కేశవాపురం గ్రామాల్లోని రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ అజ్మీర సైదులు సోమవారం తెలిపారు. అర్హులైన రైతులు దరఖాస్తు ఫారంతోపాటు రైతు పట్టాదారు పాస్‌పుస్తకం,రైతు ఆధార్‌కార్డు, నామిని ఆధార్ జీరాక్స్‌లను ఏఈఓకు ఈనెల 13వరకు అందించాలని తెలిపారు. రైతు బీమా పథకం కింద నమోదైన రైతులు ఏ విధంగా మరణించినా వారి కుటుంబానికి రూ.5లక్షల పరిహారం అందుతుందని, ఈ పథకం రైతుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు. గతంలో అర్హత ఉండి దరఖాస్తు చేసుకొని రైతుల కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో పాలకులు విఫలం



మాట్లాడుతున్న రామచంద్రయ్య

పెద్దవూర : నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని సీపీఎం మండల కార్యదర్శి దుబ్బ రామచంద్రయ్య అన్నారు. సోమవారం మండలంలోని చిన్నగూడెం ఎస్సీ కాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి మాట్లాడారు. సర్వే నంబర్ 211లో గత 30ఏళ్లుగా సాగు చేసుకుంటున్న 18మంది అర్హులైన దళితులకు పట్టాదారు పుస్తకాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. అర్హులైన ప్రతి దళితుడికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దోరెపల్లి మల్లయ్య, సీహెచ్ లచ్చిరెడ్డి, గోపాల్, మాదర బిక్షం , సాంబమ్మ, శంకరయ్య, వెంకటయ్య, ఈదమ్మ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

చింతపల్లి : చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. తెలంగాణ చేనేత కార్మిక సంఘం జిల్లా ద్వితీయ మహాసభ సోమవారం చింతపల్లి మండలంలోని వెంకటేశ్వర్ నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చేనేత భరోసా పథకానికి 10 వార్పులు ఉత్పత్తి చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేనేత కార్మిక చేసిన ఘనత అమోఘం అన్నారు. ప్రతి చేనేత కార్మికుడికి జియో ట్యాగ్ చేసి సబ్సిడీపై సంక్షేమ పథకాలు అందించాలన్నారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు చేనేత కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్ రాములు, కార్యవర్గ సభ్యుడు చేపూరి ధనంజయ, చేపూరి వెంకటయ్య, జ్యోతిబాస్, రావి రారా శ్రీను, కర్నాటి గణేశ, గుర్రం చంద్రమౌళి, మస్న దామోదర్ పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై ప్రత్యేక దృష్టి

త్రిపురారం : విద్యార్థులలో మానసిక, శారీరక ఎదుగుదలపై ప్రభావం చూపే నులిపురుగులను నివారించడానికి ప్రత్యేక దృష్టి పెడుతున్నామని త్రిపురారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మాలోతు సంజయ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్టీ మిని గురుకులం పాఠశాలలో నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రాలు మింగించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవం సందర్భంగా పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి ఉషారాణి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు, విద్యార్థినిలకు నులిపురుగుల పై అవగాహన కల్పించారు. అనంతరం ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆర్.నాగేశ్వర్ రావు నాయక్, సీహెచ్ఓ సుగుణాబాయి, డా.రసూల్, హెల్త్ అసిస్టెంట్ యస్.లలిత, రవి, బ్లెస్సీ, యస్ లలిత, ఆశ వర్కర్లు సైదమ్మ, యాదమ్మ, ధనమ్మ, ధనలక్ష్మి, సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

గుర్రంపోడు : మండలకేంద్రంలో సోమవారం ఆల్బెండజోల్ మాత్రలను అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి కేజీబీవీలో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసిన సందర్భంగా మాట్లాడారు. విద్యార్థుల్లో చురుకుదనానికి, రక్తహీనతను తగ్గించడానికి మాత్రలు ఉపయోగపడతాయన్నారు. మండలంలో 4,928 మంది విద్యార్థులకు మాత్రలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ రోజు పాఠశాలకు హాజరు కాని విద్యార్థులకు మరుసటి రోజు వైద్యసిబ్బంది అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ విజయశ్రీ , వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



అడవిదేవులపల్లి: విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్యులు



త్రిపురారం : ఎస్టీ మినీ గురుకులంలో..



గుర్రంపోడు : కేజీబీవీలో...

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

అడవిదేవులపల్లి : జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు సోమవారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యులు సయ్యద్ అజహర్‌అహ్మద్, రామాంజనేయులు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మాత్రలను మింగించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ షాహెద్, ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బిగ్‌హెల్ప్ సంస్థ సహకారంతో తాగునీటి ట్యాంకు



పైలాన్‌లో ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో తాగు నీటి ట్యాంకును ప్రారంభించిన దాతలు

నాగార్జునసాగర్ : పైలాన్ కాలనీలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో బిగ్‌హెల్ప్ ఆర్గనైజేషన్ వారి సౌజన్యంతో విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు వాటర్‌ట్యాంకును నిర్మించారు. సోమవారం ఆ ట్యాంక్‌ను సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులందరూ కలిసి ప్రారంభించారు. ఈ నీటి ట్యాంకు నిర్మాణానికి రిటైర్డ్ హిందీ ఉపాధ్యాయురాలు సత్యవోలు కృష్ణవేణి కుమారుడు సూర్యప్రకాశ్‌లు ఆర్థిక సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ శేషు,బిగ్‌హెల్ప్ ప్రాజెక్టు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాటి భాస్కర్‌బాబు, ప్రాజెక్టు డైరెక్టర్ రాజబాబు, మెరిట్ అవార్డ్స్ డైరెక్టర్ అంజయ్య, కూర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ అందజేత



దాతలు అందించిన స్పోర్ట్స్ డ్రెస్‌లతో విద్యార్థులు

పెద్దఅడిశర్లపల్లి : గుడిపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేసి రిటైర్డ్ పీఈటీ శీలం నారాయణరెడ్డి అదే పాఠశాలలో చదువుతున్న 110మంది విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌ను ఎంఈఓ సముద్రాల శ్రీనివాస్ చేతుల మీదుగా బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనయ్య, మాజీ సర్పంచ్ శీలం శేఖర్‌రెడ్డి, విజయ్‌శేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాల అమరవీరులకు ఘన నివాళి

హాలియా : మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య ఆదేశాల మేరకు మాల మహానాడు సంఘం ఆధ్వర్యంలో సోమవారం హాలియా పట్టణంలో మాల అమరవీరులు పానంగి శేషయ్య, గోపతోటి నారాయణ, రెడ్డి సత్యనారాయణలకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాల మహానాడు సంఘం నాయకులు మాల అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు సాగర్ నియోజకవర్గ ప్రధానకార్యదర్శి జంగాల శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శులు జంగాల బిక్షం, గండమళ్ల జానయ్య, నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ రువ్వ వెంకటేశ్వర్లు, పెద్దవూర మండల మాల మహానాడు అధ్యక్షుడు మద్దూరి శ్రీను, నాయకులు రువ్వ అనంతరాములు, జంగాల వెంకటరాములు, మద్దెల డేవిడ్, మోటమర్రి సురేందర్, రువ్వ వినోద్ కుమార్, గండమళ్ల ప్రసాద్ తదితరులు ఉన్నారు.



మాల అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

రహదారి నిర్మాణ పనులు చేపట్టాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

వేములపల్లి : మండలంలోని బీమారం– సూర్యాపేట రహదారి నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి అన్నారు. కురిసిన వర్షాలకు అధ్వానంగా తయారైన బీమారం – సూర్యాపేట రహదారిపై సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి నిర్మాణం చేపట్టి సుమారు 15ఏళ్లు కావొస్తున్నా ఇప్పటి వరకు పూర్తి చేయకపోవడంతో రహదారి అధ్వానంగా తయారై ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వేములపల్లి అడ్డరోడ్డు నుంచి బీమారం బ్రిడ్జి వరకు రహదారికి మరమ్మతులు చేపట్టి నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే ఈనెల 15న మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లింగయ్య, వెంకటరమణ, శ్రీహరి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు సక్రమంగా అందించాలి



మాట్లాడుతున్న బైరం దయానంద్

మిర్యాలగూడ : దామరచర్ల మండల కేంద్రంలోని ముగ్గు మిల్లుల యాజమాన్యాలు కార్మికులకు వేతనాలను సక్రమంగా అందించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని సీఐటీయూ మండల కన్వీనర్ బైరం దయానంద్ ఆరోపించారు. సోమవారం దామరచర్ల మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల కేంద్రంలో సుమారు 80 ముగ్గు మిల్లులు ఉండగా వెయ్యి మంది కార్మికులు పనిచేస్తున్నారని వారికి రూ.70 ఇస్తుండగా మిషన్ పేరుతో రూ.45కు తగ్గించి ఇస్తున్నారని దీంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా కార్మికులకు బెల్లం, చెప్పులు, మాస్కులు, దుస్తులు అందించడం లేదన్నారు. ఇప్పటికైన యజమాన్యాలు స్పందించి కార్మికులకు రూ.80 అందించాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వినోద్, ఎర్ర నాయక్, పాపానాయక్, నీలాబాయి, రాందాసు రవి, సైదా తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



మొక్క నాటుతున్న ఎన్‌వీటి, తదితరులు

దేవరకొండ : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ వీటి అన్నారు. సోమవారం అసోసియేషన్ భవనంలో మొక్కలు నాటి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా అందరూ విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో మొక్కలు ఎంతో కీలకమన్నారు. ఖాళీ ప్రదేశాలతో పాటు అధికారులు ఇంటింటికీ పంపిణీ చేస్తున్న వివిధ రకాల మొక్కలను నాటి భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌గౌడ్, పంతులాల్, వెంకన్న, భాస్కర్‌రెడ్డి, సురేష్, జగదీశ్వర్, జమీర్ ఉన్నారు.